**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేది: 17.05.2026** **సమయం: 13.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. ధాన్యం కొనుగోళ్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు.
2. పోక్సో కేసులో నిందితుడైన బండి భగీరథ్‌ను నిన్న రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. కాగా, చట్టం ముందు అందరూ సమానమేనని, న్యాయ వ్యవస్థపై తమకు నమ్మకముందని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు.
3. జన్ భాగీ దారి-సబ్సే దూర్, సబ్సే పెహలే కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మారుమూల గిరిజన ప్రాంతాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.
4. రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. రానున్న మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరో 2-3 డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

-------------------------------------------

**కిషన్ రెడ్డి:**

ధాన్యం కొనుగోళ్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. నాంపల్లి రాష్ట్ర బిజెపి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ... ఎన్నికల ముందు రైతు డిక్లరేషన్ పేరిట ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదని ఆరోపించారు. రుణమాఫీ కాకపోవడంతో లక్షలాది మంది రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోళ్ల కోసం అయ్యే బస్తాలు, రవాణా, నిల్వ ఖర్చులను కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. అయినప్పటికీ కొనుగోళ్లు జరపకుండా రాష్ట్ర ప్రభుత్వం

కాలయాపన చేస్తూ, కేంద్రంపైనే అబద్ధపు ప్రచారాలు చేస్తోందని అన్నారు. దేశంలోని 83 కోట్ల మందికి ప్రధాని మోదీ ఉచిత బియ్యం అందిస్తున్న విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

**<u>బైట్</u> ......**

....పీటీసీ, హైదరాబాద్

**పోక్సో కేస్:**

పోక్సో కేసులో నిందితుడైన బండి భగీరథ్‌ను నిన్న రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. నిన్న ఉదయం పోలీసులు భగీరథ్ పై లుకౌట్ సర్క్యులర్ జారీ చేశారనీ, రాత్రి 8 గంటల తర్వాత నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో... సైబరాబాద్ స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ (SOT) భగీరథ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎమ్. రమేష్ రెడ్డి వెల్లడించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించిన అనంతరం మేడ్చల్‌లోని న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చగా, 14 రోజుల రిమాండ్ విధించారని ఆయన పేర్కొన్నారు. భగీరథ్‌ను పోలీసులు రాత్రి 12 గంటలకు చర్లపల్లి జైలుకు తరలించినట్లు తెలిపారు.

ఇదిలా ఉండగా, లాయర్ల సమక్షంలో తమ కుమారుడిని పోలీసు విచారణకు అప్పగించినట్లు కేంద్రం హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. న్యాయ వ్యవస్థపై తమకు పూర్తి నమ్మకముందని, చట్టం ముందు అందరూ సమానమేనని మంత్రి పునరుద్ఘాటించారు.

......డెస్క్

**<u>సబ్సే దూర్, సబ్సే పెహ్లా - ఆసిఫాబాద్:</u>**

కేంద్ర ప్రభుత్వం సౌజన్యంతో ఆసిఫాబాద్ జిల్లాలోని గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమాదేవి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జనభాగీదారి “సబ్సే దూర్, సబ్సే పహ్లా” లో భాగంగా వారం రోజులపాటు నిర్వహించే ప్రత్యేక కార్యక్రమానికి సంబంధించి ఎస్.సి.ఆర్.పి. లతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం గిరిజన ప్రాంతాల్లో నివసించే అత్యంత వెనుకబడిన గిరిజన కుటుంబాలకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు నేరుగా అందించేందుకు ప్రత్యేక అవగాహన, సేవల సాచ్యురేషన్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

-పీటీసీ, ఆసిఫాబాద్

**సబ్సే దూర్, సబ్సే పెహ్లే - భద్రాద్రి:**

జన్ భాగీ దారి-సబ్సే దూర్, సబ్సే పెహలే కార్యక్రమంలో భాగంగా... భద్రాద్రి జిల్లాలోని గిరిజన గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు బ్లాక్ లెవెల్ మాస్టర్ ట్రెనింగ్ ప్రోగ్రాములు నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ పీవో రాహుల్ తెలిపారు. ఆది కర్మయోగి అభియాన్ పథకం కింద ఎంపిక చేసిన 19 మండలాలలోని 130 గ్రామాలలో ప్రత్యేకంగా మెడికల్ క్యాంపులు కూడా నిర్వహించనున్నట్లు చెప్పారు. రేపటి నుండి ఈ నెల 25 వరకు జరిగే ఈ కార్యక్రమాలపై విస్తృత ప్రచారం కల్పించి విజయవంతం అయ్యేలా ఎంపీడీవోలు చొరవ చూపాలని పీవో కోరారు.

- పీటీసీ, భద్రాద్రి కొత్తగూడెం

**కొనుగోళ్లు - భద్రాద్రి:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 167 కొనుగోలు కేంద్రాలలో 167 మంది ప్రత్యేక అధికారులను నియమించి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు చేస్తున్నట్లు కలెక్టర్ అంకిత్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర క్వింటాల్‌కు 2 వేల 400 రూపాయిల చొప్పున రైతులకు చెల్లించి ఇప్పటివరకు 32 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, తార్పాలిన్లు, తూకం యంత్రాలు, హమాలీలు, రవాణా సదుపాయాలు తదితర అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. రైతులు ఎటువంటి సమస్యలు ఎదురైనా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కలెక్టర్ సూచించారు.

- పీటీసీ, భద్రాద్రి కొత్తగూడెం

**కొనుగోళ్లు - నల్గొండ:**

నల్గొండ జిల్లాలో ఇప్పటివరకు 6 లక్షల 76 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా... మరో రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కేంద్రాలకు వచ్చే అవకాశముందని జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ తెలిపారు. మిల్లర్లు ధాన్యాన్ని వెంట వెంటనే అన్లోడింగ్ చేయాలని ఆదేశించారు. హమాలీల కొరత లేకుండా చూడాలని ప్రతిరోజు కనీసం 400 లారీల ధాన్యాన్ని మిల్లులలో దించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా ఎస్.పి. శరత్ చంద్ర పవార్ తో కలిసి మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో పౌర సరఫరాల అధికారులు, రైస్ మిల్ యాజమానులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..... రైతుల ప్రయోజనాలకోసం అందరూ సమన్వయంతో పనిచేయాలని, ఇందుకోసం మిర్యాలగూడ లారీ అసోసియేషన్ అదనంగా 50 లారీలను అందుబాటులో ఉంచాలని, ధాన్యం తరలింపు పూర్తయ్యే వరకు సహకరించాలని కలెక్టర్ కోరారు.

- పీటీసీ, నల్లగొండ

**కొనుగోళ్లు - సిరిసిల్ల:**

ధాన్యం సేకరణ ప్రక్రియలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, క్షేత్ర స్థాయిలో కొనుగోళ్ల ప్రక్రియ, ఆన్ లైన్ ఎంట్రీలో వేగవంతమయ్యేలా చూడాలని, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్ ఆదేశించారు. మండలాల ప్రత్యేక అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ లో మాట్లాడుతూ... ధాన్యం తూకం వేయడం, మిల్లులు, గోదాములకు తరలించడం పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కొనుగోలు కేంద్రాలు, మిల్లుల వద్ద ఉన్న పరిస్థితులను పర్యవేక్షించేందుకు కేటాయించిన రెవెన్యూ, ఇతర శాఖల సిబ్బంది సమన్వయం చేసుకుని విధులు నిర్వర్తించాలన్నారు. రవాణాకు సరిపడా వాహనాలు అందుబాటులో ఉండాలని, సంబంధిత కాంట్రాక్టర్ వాహనాలు సమకూర్చకపోతే తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

- పిటిసి,రాజన్న సిరిసిల్ల

**మెడికల్ షాపుల బంద్:**

ఈ నెల 20న దేశవ్యాప్తంగా మెడికల్ షాపుల బంద్ నిర్వహించనున్నట్లు మంచిర్యాల జిల్లా కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. జిల్లా కేంద్రంలో పోస్టర్లను ఆవిష్కరించిన సందర్భంగా అసోసియేషన్ జిల్లా కార్యదర్శి తొగరు సుధాకర్ మాట్లాడుతూ... ఆన్లైన్లో మందుల విక్రయాలపై నియంత్రణ సరిగా ఉండటం లేదనీ..., తద్వారా నకిలీ, మత్తు కలిగించే మందులు కూడా ప్రిస్క్రిప్షన్ లేకుండా విచ్చలవిడిగా దొరికే అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు.

- -పీటీసీ, మంచిర్యాల

**వాతావరణం:**

రాష్ట్రంలో ఒకవైపు పగటి ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతుండగా, మరోవైపు అకాల వర్షాలు, పిడుగులతో నష్టం వాటిల్లుతోంది. ఆదిలాబాద్ బోరాజ్‌లో నిన్న రాష్ట్రంలోనే అత్యధికంగా 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండల తీవ్రతకు వనపర్తి జిల్లా అమరచింత మండలంలోని ఓ కోళ్లఫారంలో సుమారు 3,000 కోళ్లు మృత్యువాత పడ్డాయి. రానున్న మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరో 2-3 డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

ఇదిలా ఉండగా, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో శనివారం సాయంత్రం కురిసిన అకాల వర్షంతో మార్కెట్ యార్డుల్లోని ధాన్యం రాశులు నీటిలో కొట్టుకుపోయాయి. జోగులాంబ గద్వాల జిల్లాలో పొలంలో పంటను కాపాడుకునే ప్రయత్నంలో నగేష్ అనే యువకుడు పిడుగుపాటుకు గురై మరణించాడు. కొల్లాపూర్ మండలంలో పిడుగు పడటంతో 30 గొర్రెలు మృత్యు వాతపడ్డాయి.

-డెస్క్, మహబూబ్‌నగర్, జోగులాంబ గద్వాల జిల్లా

**రామగుండం సీపీ:**

ఇతర రాష్ట్రాలకు చెందిన వారికి ఇళ్లు అద్దెకు ఇచ్చేముందు, వారిని ఇళ్లలో పనిలో పెట్టుకునే ముందు పూర్తి వివరాలు సేకరించాలని, అప్రమత్తంగా ఉండాలని రామగుండం పోలీస్

కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. మంచిర్యాల హమాలీవాడలో సీఐ ప్రమోద్రావు ఆధ్వర్యంలో నిర్బంధ తనిఖీలు నిర్వహించి, జిల్లా కేంద్రంలో ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన 55 మందిని గుర్తించారు, అనుమానాస్పద వ్యక్తుల వివరాలు సేకరించారు. నంబర్ ప్లేటు, ప్రతాలు లేని వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... యువతను సన్మార్గంలో నడిచేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. మత్తు పదార్థాలనకు బానిసైన వారిని డీ అడిక్షన్ సెంటర్లలో చేర్పించాలని సూచించారు. మహిళల భద్రతకు షీ టీమ్, భరోసా సెంటర్లు పని చేస్తున్నాయని చెప్పారు.

**:::::::::::సౌండ్ బైట్=== రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా::::::::**

- పీటీసీ, మంచిర్యాల

**<u>మ్యూజియం దినోత్సవం:</u>**

రేపు ప్రపంచ మ్యూజియం దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా మ్యూజియంలు, వారసత్వ కట్టడాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెరిటేజ్ మహబూబ్నగర్ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశం తెలిపారు. ప్రజలకు చారిత్రక, సాంస్కృతిక వారసత్వంపై అవగాహన పెంపొందించేలా వివిధ సాంస్కృతిక, విద్యా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రపంచ మ్యూజియం దినోత్సవాన్ని పురస్కరించుకొని సందర్శకులకు ఉచిత ప్రవేశం కల్పించనున్నట్లు వెల్లడించారు. ప్రజలు, విద్యార్థులు, చరిత్రాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయవలసిందిగా కోరారు.

- పీటీసీ, నల్లగొండ

**<u>వన్ మినట్ రూల్:</u>**

టీజీఎన్పీడీసీఎల్ రాజన్న సిరిసిల్ల జిల్లా సర్కిల్ పరిధిలో విధులు నిర్వహించే సిబ్బంది భద్రతకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ వన్ మినిట్ రూల్ అమలు చేస్తున్నట్లు సూపరింటెండింగ్ ఇంజినీర్ వేణుమాధవ్ ఒక ప్రకటనలో తెలిపారు. క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభించే ముందు ప్రతీ ఉద్యోగి ఒక నిమిషం సమయం తీసుకుని భద్రత ప్రమాణాలను

సమగ్రంగా పున:పరిశీలించడమే దీని ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. 'ఒక్క నిమిషం జాగ్రత్త' సిబ్బంది ప్రాణాలను కాపాడగలదని పేర్కొన్నారు.

-పీటీసీ, రాజన్న సిరిసిల్ల

**స్కిల్ ట్రైనింగ్:**

ఆధునిక సాంకేతికత అనుగుణంగా విద్యార్థులు, యువకులు ఉద్యోగావకాశాలు పెంపొందించే ఉద్దేశ్యంతో ఏఐ, లైఫ్ స్కిల్స్ పై నాలుగు రోజుల ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు రాజన్న సిరిసిల్ల జిల్లా బీసీ స్టడీసర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులనీ, సర్టిఫికెట్స్ కాపీలతో బీసీ స్టడీసర్కిల్ ఆఫీసులో సంప్రదించాలని సూచించారు.

-పీటీసీ, రాజన్న సిరిసిల్ల

**అడ్మిషన్లు:**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండల కేంద్రంలోని గిరిజన మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో దోస్త్ రెండో విడత అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ జయ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థినులు ఈనెల 25వ తేదిలోపు దోస్త్ వెబ్ సైట్ లో ఐడి క్రియేట్ చేసుకొని కళాశాలలో సంప్రదించాలని కోరారు. అన్ని గ్రూపుల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయని, అర్హులైనవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

- పిటిసి, రాజన్న సిరిసిల్ల

**భూసేకరణ:**

సికింద్రాబాద్ ప్యారడైజ్ జంక్షన్ నుండి శామీర్‌పేట్ ఔటర్ రింగ్ రోడ్డు వరకు ప్రతిపాదించిన 18.15 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టు భూసేకరణ, నష్టపరిహారాల పంపిణీ ప్రక్రియ కీలక దశకు చేరుకుంది. సుమారు 2 వేల 232 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో... హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ చేపడుతోన్న ఈ ప్రాజెక్టు కోసం దాదాపు 197 ఎకరాల భూమిని సేకరిస్తున్నారు. ఇందులో రక్షణ శాఖ పరిధిలో గల 113.48 ఎకరాల

భూమికి బదులుగా అంతే విలువైన ప్రత్యామ్నాయ భూమిని బదిలీ చేసేందుకు కేంద్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదిరింది. ప్రైవేటు వ్యక్తులకు చెందిన భూమికి పరిహారం చెక్కుల పంపిణీ చేస్తున్నారు. లోతుకుంట, ఆల్వాల్, హకీంపేట, అంతాయిపల్లి, తూంకుంట ప్రాంతాలకు చెందిన 50 కి పైగా ప్రైవేటు ఆస్తుల యజమానులకు ఇప్పటికే పరిహారం చెల్లించారు. పనుల పురోగతిని కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

-పీటీసీ, మేడ్చల్ మల్కాజిగిరి